





బెలుగుప్ప మండలం గంగవరంలో వేస్తున్న రోడ్డు

బిల్లు.. చిల్లు..!

అభివృద్ధి పనుల్లో కనిపించని పురోగతి

సకాలంలో బిల్లులు చెల్లించకపోడమే కారణం
సీసీ రోడ్లకు రూ.17.60 కోట్లు ఇచ్చిన కేంద్రం
కాంట్రాక్టర్లకు రూ.11 కోట్ల బకాయిలు
ప్రభుత్వ భవనాలకు మరో రూ.15 కోట్లు
ఎన్నికలు సమీపించడంతో కాంట్రాక్టర్లలో గుబులు

- జిల్లాకు మంజూరైన సీసీ రోడ్లు : 360
- కేంద్రం కేటాయించిన నిధులు : 17.60 కోట్లు
- పెండింగ్ బిల్లులు : సుమారు రూ.26 కోట్లు

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 11: వైసీపీ అధికారంలోకి వచ్చాక పల్లె రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు రూ.17.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను 360 సీసీ రోడ్లను వినియోగించాలని సూచించింది. కానీ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనులు చేయించలేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో మిగిలిన పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు తదితర భవనాల బిల్లులను సైతం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచింది. దీంతో కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా బిల్లులు చెల్లించనందుకే పీఆర్ పనులు ముందుకు సాగడం లేదు.



వజ్రకరూరులో చేస్తున్న రోడ్డు పనులు

బిల్లులు పెండింగ్

గ్రామీణ ప్రాంతాల్లో 360 సీసీ రోడ్లకు కేంద్రం రూ.17.60 కోట్లు ఇచ్చింది. ఉపాధి పథకం కింద ఈ పనులను చకచకా పూర్తి చేయించి, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సింది. తద్వారా మిగిలిన పనులు చేసే కాంట్రాక్టర్లలో నమ్మకం కుదురుతుంది. అభివృద్ధి వేగంగా సాగుతుంది. కానీ చేసిన పనులకు మూడు నెలల నుంచి ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్లకు రూ.11 కోట్ల వరకు సీసీ రోడ్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీరికి పైసా కూడా రాకపోవడంతో మిగిలిన పనులు చేసే కాంట్రాక్టర్లు సైతం మొండికేశారు. ఎన్నికల నోటిఫికేషన్ మరి కొన్ని రోజుల్లోనే రానుంది. ఈ నేపథ్యంలో బిల్లులు వస్తాయో లేదోనని కాంట్రాక్టర్లు ఆందోళనలో ఉన్నారు. రాప్తాడు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజవర్గాల పరిధిలో సీసీ రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లులు చెల్లిస్తే తప్ప కాంట్రాక్టర్లు పనులు చేసేలా కనిపించడం లేదని అధికారులే అంటున్నారు.

జిల్లాలో భవనాల పరిస్థితి..

భవనాల పేర్లు	మంజూరు	పూర్తి
సచివాలయాలు	469	344
రైతు భరోసా కేంద్రాలు	411	294
వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు	326	197
డిజిటల్ లైబ్రరీలు	186	01
మొత్తం	1392	836

ప్రభుత్వ భవనాల బిల్లులూ అంతే...

వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల గురించి గొప్పగా చెప్పుకుంటోంది. కానీ ఆ భవనాల నిర్మాణంలోనూ ఆశించిన పురోగతి లేదు. సుమారు రూ.12 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. డిజిటల్ లైబ్రరీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. జిల్లాకు 186 లైబ్రరీలను మంజూరు చేయగా, ఇప్పటి వరకూ 177 లైబ్రరీల నిర్మాణం మొదలే కాలేదు. సచివాలయాలు 469 మంజూరు చేయగా.. 344 పూర్తి అయ్యాయి. రైతు భరోసా కేంద్రాలు 411 మంజూరు చేయగా 294, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు 326 మంజూరు చేయగా 197, డిజిటల్ లైబ్రరీలు 186 మంజూరు చేయగా ఒక్కటి మాత్రమే పూర్తి అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 1,392 భవనాల కుగానూ 836 మాత్రమే పూర్తి అయ్యాయి. మిగిలిన 556 భవనాలు వివిధ దశలలో ఉన్నాయి. కొన్ని పునాదులకే పరిమితమయ్యాయి. ఈ స్థాయిలో పెండింగ్‌లో ఉంటే చెడ్డపేరు వస్తుందని భావించి, 250 భవనాలకు పైగా నిర్మాణాలను చేపట్టవద్దని ఆదేశించినట్లు సమాచారం. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లకు రూ.3 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా ఆరోగ్యశాఖ నుంచి రూ.60 లక్షల బిల్లులు మంజరైనట్లు ఆశాఖ వర్గాలు తెలిపాయి.



ఉరవకొండ మండలం నెరమెట్లలో నిర్మిస్తున్న హెల్త్ క్లినిక్

రూ.26 కోట్లు పెండింగ్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల బిల్లులు రూ.26 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నాలుగు నెలల క్రితం సీసీ రోడ్లకు కేంద్రం రూ.11 కోట్లు మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించలేదు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకుందేమో అన్న అనుమానాలను కాంట్రాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. ఇవి కాకుండా ప్రభుత్వ భవనాలకు సంబంధించి రూ.15 కోట్ల బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

బంధువు పెత్తనం

బీకేఎస్‌లో దళిత సర్పంచ్‌కు చెక్

- చేసిన పనులకు బిల్లులు తిన్న ముఖ్యనేత
- నింద సర్పంచ్‌పై మోపి.. చెక్ పవర్ రద్దు
- తప్పు జరిగుంటే.. అప్పటి కార్యదర్శులపై చర్యలేవీ..?
- రాజకీయ కక్ష సాధింపులపై దళిత సంఘాల మండిపాటు



సర్పంచ్ పార్వతి



జనచైతన్య కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బందిపడుతున్న ప్రజలు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 11: ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తరువాత దేవుని సాక్షిగానో, ఆత్మసాక్షిగానో ప్రమాణం చేస్తారు. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం చూపించబోమని ఆ సందర్భంగాపై గట్టిగానే చెబుతారు. కానీ అసలు విషయానికి వస్తే.. బంధువులు, ఆశ్రితులే పెత్తనం చేస్తుంటారు. సామంతరాజుల్లాగా ఆ ప్రజాప్రతినిధి పరిధిలోని పంచాయతీలు, మండలాలను పంచేసుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఆర్థికంగానో, సామాజికంగానో వెనుకబడి ఉంటే.. ఇక వారిపై స్వారీ చేస్తుంటారు. శింగనమల నియోజకవర్గంలోనూ ఇదే జరుగుతోంది. సీఎం జగన్ ఎప్పుడు 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు..' అంటుంటారు. కానీ ఆయన ఎస్సీలు,



ఆయన ఎస్టీలపై.. ఆయనపార్టీ ప్రజాప్రతినిధుల బంధువులే పెత్తనం చేస్తున్నారు. రాజ్యాంగేతర శక్తులుగా అవతరించి.. పాలనా వ్యవహారాలను నడిపిస్తున్నారు. బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో ఇదే జరుగుతోంది. ఇక్కడి దళిత సర్పంచ్‌పై నియోజకవర్గ ముఖ్యమైన ప్రజాప్రతినిధి బంధువు పెత్తనం చెలాయిస్తున్నారు. మేజర్ పంచాయతీపై పట్టుకోసం ఏకంగా దళిత సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయించారు. పంచాయతీ నిర్వహణ, పనులు కేటాయింపు అన్నీ బంధువు కనుసన్నల్లోనే సాగుతున్నాయి. దళిత సామాజివర్గం కావడం, మహిళ కావడంతో ఈ శక్తులను ఎదుర్కొనడం ఆమెకు శక్తికి మించిన పని అవుతోందని స్థానికులు అంటున్నారు.

ఏం జరిగింది..?

బుక్కరాసముద్రం మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి. పంచాయతీ పరిధిలో జనరల్ ఫండ్స్ కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. మొత్తం 142 పనులకు రూ.2.40 కోట్లు వినియోగించారు. ఇందులో సర్పంచ్ రూ.13 లక్షల విలువైన ఒక పనినిఇ మాత్రమే చేయించారు. వైసీపీ ముఖ్యనేత దాదాపు 80 పనులను బినామీ కాంట్రాక్టర్ల చేత చేయించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పనులకు సంబంధించి నిధులను డ్రా చేశారు. ముఖ్యనేత బినామీ పేరిట పంచాయతీ నుంచి రూ.కోటి నిధులు డ్రా చేశారు. దీని కోసం చెక్కు కాకుండా.. నగదు వినియోగించారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమని అప్పటి పంచాయతీ కార్యదర్శి చెప్పాలి. కానీ ముఖ్య ప్రజాప్రతినిధి ఒత్తిడి కారణంగా కార్యదర్శి, సర్పంచ్ డబ్బులు డ్రా చేశారని సమాచారం. చేసిన పనులకు ఎంబుక్‌లు, ఇతర రికార్డులు ఉన్నాయి. ఈ వ్యవహారంలో అధికారులపై ఎలాంటి విచారణ జరపలేదు. వారిపై చర్యలు తీసుకోలేదు. సర్పంచ్‌దే బాధ్యత అన్నట్లు.. ఆమె చెక్ పవర్‌ను రద్దు చేయించారు. ఇది రాజకీయ కక్ష సాధింపులో భాగమేనన్నది బహిరంగ రహస్యమని అధికారపార్టీవారే అంటున్నారు.

తినేసి.. సర్పంచ్‌పై నిందలా..?

గ్రామ పంచాయతీలో చేసిన పనులకు ఎంబుక్‌లు ఉన్నాయి. నగదు చెల్లింపు వివరాలు, ఓచర్లు కూడా సక్రమంగా ఉన్నాయని అధికారులు తేల్చారు. ఆ సొమ్ము అధికార పార్టీ ముఖ్యనేతకు వెళ్లిందని, కానీ తనకు సర్పంచ్ ఇవ్వలేదని బుకాయిస్తున్నారని సమాచారం. సర్పంచ్ ఒక్క పైసా తీసుకోకుండా, పంచాయతీ నిధులను డ్రా చేసి ముఖ్య నేతకు ఇచ్చేశారని సమాచారం. అప్పట్లో ఎలాంటి విభేదాలు లేకపోవడం, అందరూ అధికార పార్టీవారే కావడంతో అలా నడిచిపోయింది. కానీ అక్కడి రాజకీయ సమీకరణాలు మారాయి. సర్పంచ్ తమ మాట వినడం లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అధికార పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే సర్పంచ్ పవర్‌కు 'చెక్' పెట్టారు. డబ్బులను ముఖ్యనేత తీసుకుని, నిందలు సర్పంచ్‌పై మోపుతున్నారని సొంతపార్టీవారే దుమ్మెత్తి పోస్తున్నారు.



బీకేఎస్ గ్రామసచివాలయం

అభివృద్ధికి గ్రహణం

అధికార పార్టీలో ఆధిపత్య పోరు కారణంగా మేజర్ పంచాయతీలో అభివృద్ధి కుంటుపడుతోంది. గత ఏడాది మే నెలలో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. అప్పటి నుంచి కార్యదర్శి ఏ పనులనూ చేయించలేకున్నారు. పంచాయతీలో మొత్తం 42 కాలనీలు ఉన్నాయి. మౌలిక సదుపాయల కల్పన, నిర్వహణకు నిత్యం డబ్బులు అవసరమౌతాయి. తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం.. ఇలా వేటిని ముట్టుకున్నా డబ్బులు కావాల్సిందే. కానీ సర్పంచ్‌కు ఆ అధికారం దూరమైంది. సర్పంచ్ సొంత డబ్బులు వెచ్చించి కొన్ని పనులను చేయించారు. ఆ మేరకు నిధులు డ్రా చేయడానికి కూడా అధికారులు సహకరించడం లేదని సమాచారం.

కార్యదర్శులపై చర్యలేవీ..?

గ్రామ పంచాయతీలో అనధికారికంగా డబ్బులు డ్రా చేశారన్న ఆరోపణలతో సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు. పనులు చేసినట్లు రికార్డులు ఉన్నాయి. నగదు రూపంలో నిధులు డ్రా చేయడం తప్పని డీఎల్పీ విచారణలో తేల్చారు. ఈ వ్యవహారాలలో భాగస్వాములైన అప్పటి గ్రామ కార్యదర్శులు ముత్యాలరెడ్డి, రవి, చంద్రశేఖర్ గురించి విచారణే జరగలేదు. దీని వెనుక అంతర్యమేమిటని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. గ్రామ కార్యదర్శిలపై చర్యలు తీసుకోకుండా జిల్లా అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చారని సమాచారం.

పిల్లల పండుగకు వేళాయె..

నేటి నుంచి అనంత బాలోత్సవం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11: పిల్లల పండుగ (అనంత బాలోత్సవం-2024) కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడురోజులపాటు జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా, కార్యదర్శి శ్రీనివా సరావు, కోశాధికారి జిలాన్, సహాయ కార్యదర్శి సావిత్రి సందర్శించారు. షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ... పిల్లల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారిలో మానసికోల్లాసం పెంపొందించేందుకు ఉత్సవాలు దోహదపడతాయన్నారు. బాలోత్సవాల్లో పాల్గొనేందుకు పాఠశాలల వారీగా ఈసారి పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రదర్శనల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.

ఫోన్ నంబర్లు ఎందుకో..?

డ్వాక్రా సభ్యుల నంబర్లు ఇవ్వాల్సిందే..
మున్సిపల్ చైర్‌పర్సన్ హుకుం?
సర్వత్రా అనుమానాలు



రాయదుర్గం, ఫిబ్రవరి 11: పట్టణంలోని మెప్మా పరిధిలో ఉండే డ్వాక్రా సభ్యుల ఫోన్‌నంబర్లను రెండురోజుల్లో ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఆదేశించినట్లు తెలిసింది. దీంతో రీసోర్స్ పర్సన్లు.. సభ్యుల ఫోన్ నంబర్లు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు దీని వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని అనుమానిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల కోసం నిరీక్షిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 15 వేలమంది దాకా పొదుపుసంఘాల్లో సభ్యులున్నారు. వారికి సంబంధించిన ఫోన్ నంబర్ల వివరాలు ఆయా వార్డుల సంఘాల అధ్యక్షుల వద్ద ఉంటాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నట్టుండి ఫోన్‌నంబర్ల వివరాలను అడగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉన్న వైసీపీని గెలిపించుకోవడానికి ఫోన్ నంబర్ల ద్వారా ప్రచారం చేసి, వారిని పార్టీకి అనుకూలంగా మార్చుకోవడమే దీని వెనుక అంతర్యమని అనుమానిస్తున్నారు. పైగా చాలామంది సభ్యులకు ఫోన్‌నంబర్ల ద్వారా ఫోన్ పే, గూగుల్ పే లాంటి యూపీఐ యాప్స్ ఉండడంతో సొమ్ము ఎరవేసేందుకు కూడా వ్యూహం రచించి ఉండొచ్చని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నోటిఫికేషన్ వచ్చేలోపు పొదుపుసంఘాల సభ్యుల ఫోన్ నంబర్లు తమ వద్ద పెట్టుకుని, ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కొందరు ఆర్పీలు ఫోన్‌నంబర్లు, సంఘాల సభ్యుల వివరాలు ఇస్తే ఉద్యోగరీత్యా సమస్య తలెత్తుతుందేమోనని భయాందోళనలు చెందుతున్నారు.

నిబంధనలకు నీళ్లు



ఎలాంటి చలానా చెల్లించని కంపెనీ
ఇరిగేషన్ శాఖ నోటీసులకు స్పందించని వైనం
ప్రజాప్రతినిధి భర్తకు ముడుపులిచ్చారనే ఆరోపణలు

శింగనమల చెరువు

హైవే పనులకు శింగనమల చెరువు నీళ్లు

ప్రతిరోజూ 50 నుంచి 60 ట్యాంకర్లు

శింగనమల, ఫిబ్రవరి 11: ముడుపులు చెల్లిస్తే చాలు నియోజకవర్గంలో ఏపనైనా జరిగిపోతుంది. నీరు కావాలన్నా మట్టి కావాలన్నా స్థానిక ప్రజాప్రతినిధులకు కప్పం కడితే చాలు అనుమతి ఉన్నా లేకున్నా ఏమైనా చేసుకోవచ్చు. అందుకు ఉదాహరణే శింగనమల చెరువులోని నీటిని హైవే పనులకు వాడకం. నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో 37 కిలోమీటర్లు జాతీయ రహదారి పనులను ఒక కంపెనీ చేస్తోంది. నాలుగు నెలల కిందట అక్కడ పనులు ప్రారంభించారు. రోడ్డు పనులకు శింగనమల చెరువు నుంచి నీటిని వాడుకుంటున్నారు. నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మాణ పనులలోనే నీటి కోసం అంచనా వేసి ప్రణాళిక వేస్తారు. దాని ప్రకారం రోడ్డుకు అవసరమైన నీటి కోసం ఇరిగేషన్ శాఖను సంప్రదించి చలానా చెల్లించి, అనుమతులు తీసుకుంటారు. ఆ తర్వాతే నీటిని వాడుకుంటారు. అయితే ఈరోడ్డు పనులకు నీళ్ల విషయంలో నిబంధలను తుంగలోకి తొక్కేశారు. దర్జాగా ప్రతి రోజు నీటిని తోడేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు ఎన్ని సార్లు నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేదు. నీటిని తోలుకునే విషయంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధి భర్తకు రూ.లక్షల్లో ముడుపులు చెల్లించినట్లు సమాచారం. రైతులు, ప్రజలు, మత్స్యకారులు నీటి తోలకంపై నిలదీస్తున్నా అధికారులు మౌనంగానే ఉంటున్నారు. ప్రజాప్రతినిధులు జేబులు నింపుకోవడం కోసం చెరువులోని నీరు అమ్మడం ఏంటని రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు.



రోడ్డుకు ట్యాంకర్ ద్వారా నీరు పెడుతున్న దృశ్యం

మూడుసార్లు నోటీసులు...

శింగనమల చెరువు నుంచి రోడ్డు పనులకు వాడుకొనే నీటి కోసం అనుమతులు తీసుకోవాలని రోడ్డు పనులు చేసే కంపెనీకి స్థానిక ఇరిగేషన్ అధికారులు మూడు సార్లు నోటీసులు జారీ చేశారు. అయితే కంపెనీ నుంచి ఎలాంటి సమాధానం లేదు. నీటి అనుమతుల విషయంలో ప్రజాప్రతినిధులు, పై స్థాయి అధికారులు జోక్యం చేసుకోవడంతో ఈవిషయం మాపరిధిలో లేదంటూ అధికారులు అవేదన వ్యక్తం చేశారు. అయితే మా చెరువులో నీరు అమ్ముకోవడానికి నియోజకవర్గం ప్రజాప్రతిని భర్తకు ఏమి హక్కు ఉందని రైతు సంఘం నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీరు అమ్ముకోవడం దారుణం



నియోజకవర్గంలో హైవే రోడ్డు పనులకు శింగనమల చెరువులో నీరు అమ్ముకోవడం దారుణం. వైసీపీ నాయకుడు లక్షల్లో డబ్బు తీసుకున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. చెరువు కింద పంటను సాగు చేయడానికి ఉన్న నీరు సరిపోదని కొందరు రైతులు వెనకడుగు వేశారు. అలాంటి సమయంలో ఉన్న నీటిని రోడ్డు పనులకు అడ్డగోలుగా తోలడం దారుణం. అధికారులు తమకు సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు. ఇది ఎంతవరకూ సమంజసం.

- చిన్నప్పయాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

నోటీసులకు స్పందన లేదు

శింగనమల చెరువు నుంచి రోడ్డు పనులకు నీరు వాడుకోవాలంటే తప్పని సరిగా మాశాఖ నుంచి కేటాయింపులకు చలానాలు చెల్లించాలి. అలాంటివి ఇక్కడ జరగలేదు. నీటిని మాత్రం కంపెనీ వారు యథేచ్చగా వాడుకుంటున్నారు. ఈవిషయంపై స్థానిక ఏఈ మూడుసార్లు నోటీసులు జారీ చేసినా రోడ్డు పనులు చేసే వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

- రాజ్‌కుమార్, డీఈ, ఇరిగేషన్

శింగనమల చెరువుకు సమీపంలో 37 కిలో మీటర్ల జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. చెరువు మరువకొమ్మవద్ద రోడ్డు పనులు కోసం 10 నీటి ట్యాంకులు ఉన్నాయి. ప్రతి రోజు 50 నుంచి 60 ట్యాంకులు నీటిని పనులకు వాడుతారు. గత నాలుగు నెలలు నుంచి అలాగే వాడుకోవడంతో చెరువులో నీటి శాతం తగ్గిపోతోంది. చెరువు కింద 2500 ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది. 250 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. అసలే వర్షాలు రాని సమయం, పైగా వేసవి కాలంలో ఇలా చెరువులో ఉన్న కొద్దిపాటి నీరు రోడ్డు పనులకు వాడేస్తే మేమెలా బతకాలని రైతులు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శింగనమల చెరువు నుంచి జనరేటర్‌తో నీటిని తోడుతున్న దృశ్యం



శింగనమల చెరువు నుంచి నీటిని తరలిస్తున్న ట్యాంకర్ వాహనాలు

బీసీల ద్రోహి జగన్

మాజీ మంత్రి కాలవ



గజమాలతో మాజీ మంత్రి కాలవని సన్మానిస్తున్న రంగచేడు తెలుగు యువత

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో బీసీలను అణగదొక్కుతూ అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేసిన ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. మండలంలోని కలుగోడు గ్రామంలో ఆదివారం జయహో బీసీ మహాగర్జన నిర్వహించారు. తొలుత కాలవ శ్రీనివాసులుకు గజమాలతో స్వాగతం పలికి, ఊరేగించారు. అనంతరం సభలో కాలవ మాట్లాడుతూ.. తెలుగుదేశం పాలనలోనే బీసీల అభివృద్ధి జరిగిందన్నారు. బీసీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి, ఆధునిక పరికరాలను పంపిణీ చేసిన ఘనత చంద్రబాబునాయుడుదేనన్నారు. ఎన్నికల్లో బీసీలను మోసగించేందుకు ముఖ్యమంత్రి జగన్ మాయమాటలతో మభ్యపెడుతున్నాడని విమర్శించారు. బీసీలను అణగదొక్కి కేసులు బనాయించాడని మండిపడ్డారు. రాయదుర్గం నియోజకవర్గంలో తనపైనే వందలాది కేసులు బనాయించాడన్నారు. ఎన్నికేసులు పెట్టినా భయపడేది లేదని ఉద్ఘాటించారు. టీడీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీసెల్ నేతలు ఆవుల క్రిష్ణయ్య, నాగరాజు, జనసేన నాయకుడు మంజునాథ్‌గౌడ్, టీడీపీ మండలాల కన్వీనర్లు గిరిమల్లప్ప, హనుమంతరెడ్డి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో కదిరి, మడకశిర జట్ల విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ప్రశాంత్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 11: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సీనియర్ టీ-20 ఏపీఎల్ క్రికెట్ పోటీల్లో కదిరి, మడకశిర జట్లు విజేతలుగా నిలిచాయి. ఓ మ్యాచ్‌లో కదిరి, పోలీసు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కదిరి నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 141 పరుగులు చేసింది. ఇందులో ప్రశాంత్ అజేయ హాఫ్ సెంచరీ (79 నాటౌట్)తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన పోలీసు జట్టు 16.5 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. దీంతో కదిరి 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో మడకశిర, ఏబీఎల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మడకశిర నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 138 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఏబీఎల్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసి, ఓటమి పాలైంది. మడకశిర 2 పరుగుల తేడాతో విజయం సాధించింది.

రామగిరి సీఐ శివప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 11: నకిలీ ఓటర్ ఐడీ కార్డుల దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారన్న కారణంగా ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐ, ఒక హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఇద్దరు సీఐలను వీఆర్‌కు తీసుకొచ్చారు. 2021 తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల నేపథ్యంలో కొందరు ఫేక్ ఓటర్ ఐడీ కార్డులు ఉపయోగించి ఓటు వేశారనే విషయంపై తిరుపతి ఈస్ట్, తిరుపతి వెస్ట్, అలిపిరి పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో సరైన దర్యాప్తు చేయలేదనే విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఈ క్రమంలో అప్పటి తిరుపతి ఈస్ట్ సీఐ శివప్రసాద్‌రెడ్డి, తిరుపతి వెస్ట్ సీఐ శివప్రసాద్, తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఎస్ఐ జయస్వామి, తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ద్వారకానాథ్‌రెడ్డిని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సస్పెండ్ చేశారు. వారిలో వెస్ట్ సీఐగా ఉన్న శివప్రసాద్ తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేస్తుండగా నాలుగురోజుల క్రితం శ్రీసత్యసాయి జిల్లా రామగిరి సీఐగా బదిలీ చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టారు. అలిపిరి సీఐగా ఉన్న అప్పన్నను అనంతపురం ఎస్పీ వీఆర్‌కు, రైల్వేలో ఉన్న సీఐ దేవేంద్రకుమార్‌ను వీఆర్‌కు పంపుతూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు




పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లా, ఫిబ్రవరి 11: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తి రెసిడెన్సి, కమలానగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. సోమ, మంగళ, రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు..?

- ఆవేదనలో వ్యవసాయ శాఖ ఎంపీఈఓలు
- పని భారం.. తక్కువ వేతనం..
- ఐదు నెలలు ఆలస్యంగా రెన్యువల్...
- రెండు, మూడు నెలలకోసారే జీతాల చెల్లింపు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై 98 మంది విధులు
- సొంత జిల్లాలోనే పోస్టింగ్ ఇవ్వాలని వేడుకోలు



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11 : వ్యవసాయ శాఖలోని ఎంపీఈఓలు (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్) పని భారంతో విలవిల లాడుతున్నారు. ప్రభుత్వ వైఖరితో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో 2015 లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా అనంత ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను 1000 హెక్టార్లకు ఒకరి చొప్పున కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. అయితే వైసీపీ పాలనలో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్థక శాఖ తరపున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించారు. వ్యవసాయ శాఖలో వీఏఏలను నియమించారు. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో అప్పటి దాకా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు గడ్డుకాలం ఏర్పడింది. 2020 సంవత్సరంలో అనంత ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 650 మందిలో 260 మందిని చిత్తూరు జిల్లాకు ఓడీ (ఆన్‌డ్యూటీ) పై బదిలీ చేశారు. ఆర్బీకేలను జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది.

ఉమ్మడి చిత్తూరులో 98 మంది..

అనంత జిల్లా నుంచి ఓడీపై 260 మంది ఎంపీఈఓలను పంపారు. వీరిలో 98 మంది ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తప్పని పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. ఇందులో 60 మంది దాకా మహిళా సిబ్బంది ఉండటం గమనార్హం. కొన్నేళ్లుగా ఎంపీఈఓగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే సదరు సిబ్బంది ఎప్పటికైనా తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వకపోతారా అన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. అక్కడికి వెళ్లలేక మిగతా 162 మంది మిన్నకుండిపోయారు. తమకు జిల్లాలోనే ఉద్యోగ అవకాశం కల్పించాలని అనేక సార్లు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆయా సిబ్బంది ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

తక్కువ వేతనం... పనిభారం..

వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు వేతన వ్యథలు తప్పడం లేదు. ఎంపీఈఓలకు 2015 సంవత్సరంలో రూ.8వేల వేతనం ఇచ్చేవారు. 2016 సంవత్సరంలో వారి వేతనాన్ని రూ.12వేలకు పెంచారు. దీంతోపాటు ఇన్సెంటివ్ నెలకు రూ.3వేలు వర్తింపజేశారు. పనితీరు ఆధారంగా ఇన్సెంటివ్ ఖరారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. చిత్తూరు జిల్లాలో పనిచేసే ఎంపీఈఓలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు కూడా వేతనం సరిపోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు సుదూరంగా పోస్టింగ్‌లు ఇవ్వడంతో కష్టాలు తప్పడం లేదు. ఏటా మార్చి నెలాఖరుకు ఎంపీఈఓల రెన్యువల్ గడువు ముగుస్తుంది. అయితే ఐదు నుంచి ఆరు నెలల ఆలస్యంగా రెన్యువల్ చేపడుతున్నారు. వేతనాలు కూడా రెండు, మూడు నెలలకోసారి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అసిస్టెంట్లకు సమానంగా ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. అయినప్పటికీ వారితో సమానం గా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శ్రీకాళహస్తి మండలం యనగళూరు ఆర్బీకేలో పనిచేస్తున్న ఎంపీఈఓ అధిక పనిఒత్తిడి, తక్కువ వేతనంతో మానసిక క్షోభకు గురై ఆత్మహత్యాయత్నం చేసింది. సొంత జిల్లాలో పనిచేసే సిబ్బందికే ఆ పరిస్థితి ఉన్నప్పుడు అనంత జిల్లాకు చెందిన ఎంపీఈఓలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏ విధంగా పనిచేస్తారంటూ బాధిత సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తమకు తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఎక్కడ..?

: నాగరాజు, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే వీఏఏలతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా వారి కంటే తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. ఆర్బీకే సిబ్బందితో పాటు తమకూ టైం స్కేల్ వర్తింపజేయాలని సీఎం జగన్‌తోపాటు ప్రజాప్రతినిధులకు పలు మార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. చిత్తూరు జిల్లాలో పని చేసే వారికి ఇక్కడ పోస్టింగ్‌లు ఇవ్వాలి. ఇప్పటికైనా పాలకులు మా సమస్యలపై స్పందించాలి

జిల్లాలో తిరిగి పోస్టింగ్ ఇవ్వాలి

: రెడ్డి ప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంపీఈఓల సంఘం అధ్యక్షుడు



అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన 98 మంది ఎంపీఈఓలు ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికంగా మహిళా సిబ్బంది ఉన్నారు. ఆర్బీకే సిబ్బందికి సమానంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఎంపీఈఓలకు తక్కువ వేతనం ఇవ్వడం సరైంది కాదు. అందులోనూ అనంతకు చెందిన ఎంపీఈఓలను ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనులు చేయిస్తుండటంతో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా అనంత జిల్లాలో తిరిగి పోస్టింగ్‌లు ఇప్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

మత్స్యకారులపై జీవో 217 దెబ్బ

- సొసైటీలకు ప్రాణసంకటంగా మారిన జీవో
- అమలైతే సభ్యుల జీవితాలు దుర్భరం
- చెరువుల వేలంపై ఆ వర్గాల్లో ఆందోళన
- భగ్గుమంటున్న మత్స్యకారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 11: మత్స్యకారులపై దెబ్బ వేసే జీవో నెం.217ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాప కింద నీరులా యత్నిస్తోంది. గతేడాదే ఈ జీవోపై మత్స్యకారులు తిరుగుబాటు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పుడు కొంత వెనక్కి తగ్గింది. తాజాగా మరోమారు ఈ జీవో అమలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో ఆయావర్గాలు ఆందోళన చెందుతున్నాయి. జీవో అమలైతే మత్స్యకారులు, సొసైటీల పరిస్థితి దుర్భరంగా మారుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

వెరీ డేంజర్ జీవో...



ఉమ్మడి జిల్లాలో దాదాపు 1200 చెరువులున్నాయి. వీటిలో సొసైటీల పరిధిలో 100, గ్రామ పంచాయతీ కింద 300కుపైగా, ఇరిగేషన్ కింద రూ. 300వరకూ ఉన్నాయి. ఇది వరకూ జీవో నెం 776 ప్రకారం ఆయా చెరువులకు సంబంధించిన లీజు సొమ్మును మత్స్యశాఖకు చెల్లించేవారు. సొసైటీల కింద నడిచే చెరువులైతే హెక్టారు విస్తీర్ణానికి చొప్పున లీజు మొత్తాన్ని చెల్లించేవారు. గ్రామ పంచాయతీ కింద చెరువులైతే ఆ గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ కింద నడిచేవి. లబ్ధిదారులు ఆయా చెరువులకు సంబంధించిన లీజు మొత్తాన్ని పంచాయతీ కార్యాలయంలో చెల్లించి చెరువులలో చేపపిల్లలను వ దులుకునేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొసైటీలను దాదాపుగా ఎత్తివేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. జీవో నెం 217 ద్వారా లీజు పద్ధతిలో కాకుండా చెరువులను వేలం వేయాలని ప్రయత్నిస్తోంది. ఈవేలం ప్రక్రియ కొనసాగితే సొసైటీలు ఆదాయ వనరులు కోల్పోవాల్సి వస్తుందనే వాదనలు ఉన్నాయి. ఇదివరకూ సొసైటీలు తమ పరిధిలోని చెరువులకు లీజు మొత్తాన్ని చెల్లించి చేపల పెంపకం చేపట్టేవారు. వచ్చిన ఆదాయంలో సొసైటీ లో ఉన్న సభ్యులందరూ సమానంగా పంచుకునేవారు. అయితే జీవో నెం 217 అమలైతే చెరువులను వేలంపాట నిర్వహించడంతోపాటు.. ప్రభుత్వమే చేపపిల్లలను వదలడం, పెంపకం, వచ్చిన ఆదాయంలో సొసైటీలకు 30 శాతం, మత్స్యశాఖకు 20 శాతం, ఇరిగేషన్ శాఖకు 40 శాతం, పంచాయతీలకు 10 శాతం చొప్పున చెల్లించే విధంగా జీవోను రూపొందించింది. ఇదే సొసైటీ సభ్యులను ఆందోళనలోకి నెడుతోంది.

ఆదాయం గల్లంతే...



చెరువులకు ప్రభుత్వం వేలంపాట నిర్వహిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిందేనని పలువురు సొసైటీ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 100కుపైగా మత్స్యసహకార సొసైటీలు ఉన్నాయి. ఒక్కో సొసైటీ కింద దాదాపు 80 నుంచి 100 మంది సభ్యులున్నారు. వీరందరూ తమ పరిధిలో ఉన్న చెరువుల్లో చేపల పెంపకం చేపడుతున్నారు. వచ్చిన ఆదాయంలో ఒక్కో సొసైటీలోని సభ్యులు ఒక్కొక్కరు దాదాపు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకూ ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ సొసైటీలను నమ్ముకొని దాదాపు 8500కుపైగా కుటుంబాలు ఆధార పడ్డాయి. తాజాగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 217 అమలైతే తమకు పని లేకపోవడంతో పాటు... ప్రభుత్వమిచ్చే 30 శాతం ఆదాయం ఏ మూలకు సరిదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇతర శాఖలకు నిధులను మళ్లించడం కోసం తమకొచ్చే ఆదాయానికి గండి కొట్టడమేంటని మత్స్యకారులు మండిపడుతున్నారు.

లీజు పద్ధతిలోనే కొనసాగించాలి..

: పోతన్న, మత్స్యసహకార సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు



జీఓ నెం. 217ను రద్దు చేసి పాత పద్ధతిలో జీవో 776 మేరకు చెరువులను లీజు పద్ధతిలోనే కొనసాగించాలి. అప్పుడే సొసైటీల అభివృద్ధితో పాటు... సొసైటీల కింద ఉన్న సభ్యుల జీవితాలు బాగుంటాయి. ఆ మేరకు ప్రభుత్వం పునరాలోచించి మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి. లేదంటే మత్స్యకారులు, సొసైటీలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

మత్స్యకారులకు తీరని నష్టం

: నగేష్, అధ్యక్షుడు, బుక్కరాయసముద్రం సొసైటీ

జీవో నెం. 217 అమలైతే మత్స్యకారులకు తీరని నష్టం జరుగుతుంది. దీని ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందిపడక తప్పదు. జీవోలో పొందుపరిచిన అంశాలు అమలు పరిస్తే మత్స్యకారుడు రోడ్డున పడే అవకాశం ఉంది. ప్రభుత్వం పునరాలోచించి జీవో నెం. 217ను పూర్తిగా ఎత్తివేయాలి.

వైఎస్‌కు ఆత్మ.. షర్మిలకు పరమాత్మగా కేవీపీ

- ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు కాంగ్రెస్ కుట్ర
- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 11: వైఎస్‌కు ఆత్మగా చెప్పుకుని షర్మిలకు పరమాత్మగా మారిన కాంగ్రెస్ నేత కేవీపీ.. తన అంతరాత్మను చంపుకుని బీజేపీపై ఆరోపణలు గుప్పిస్తున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మండిపడ్డారు. ఆదివారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సత్యకుమార్ మాట్లాడుతూ కేవీపీ స్క్రిప్ట్‌ను కాంగ్రెస్ మార్కెట్ చేస్తోందని, ప్రజలను దోచుకుని, దాచుకునే నాయకులు వైసీపీ, కాంగ్రెస్‌లో ఉన్నారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చి వైసీపీని గద్దెనెక్కించేందుకు కాంగ్రెస్ కుటిలయత్నం చేస్తోందని మండిపడ్డారు. తద్వారా నిరుద్యోగ రాజకీయ నాయకులకు చిన్న చిన్న పదవులను పొందటం. వారి పిల్లలను ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చేసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. ఓడిపోతే జగన్ విదేశాలకు పారిపోతాడన్నారు. అనంతరం వైసీపీని కాంగ్రెస్‌లో విలీనంచేసి 2029వరకు కొత్తగా వచ్చిన వాళ్లను ప్రజలమీద రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ కుట్రలను ప్రజలకు కేవీపీ చెప్పకుండా బీజేపీకి వైసీపీ ముడుపులిస్తోందని ఆరోపిస్తున్నారన్నారు. మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా పేర్లు చెబితేనే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తి వెన్నులో వణుకు పుడుతుందన్నారు. అలాంటి వారికి వైసీపీ ముడుపులు ఇస్తుందని కాంగ్రెస్ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. బీజేపీకి ముడుపులు ఇస్తున్నట్లు వైసీపీ అధినేత జగన్‌తో చెప్పించాలని నిలదీశారు. కాంగ్రెస్‌ది ముడుపుల సంస్కృతి అని దేశ ప్రజలకు తెలుసన్నారు. అందుకే ఏపీతోపాటు దేశం మొత్తం కాంగ్రెస్‌ను తిరస్కరిస్తోందన్నారు. మోదీపై ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీ అడ్రస్‌లేకుండా పోయాడన్నారు. సొంత నియోజకవర్గంలో దారుణంగా ఓడిపోయి కేరళలో పోటీ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్ కుటుంబీకుల అడుగులకు మడుగులొత్తే కేవీపీదే సూట్‌కేసులు మోసే సంస్కృతి అన్నారు. గతంలో సోనియా, రాహుల్‌కు ముడుపులు పంపలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్లు గొంది అశోక్‌కుమార్, చైతన్య కిషోర్, నాయకులు అజేష్ యాదవ్, జూటూరు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె, ఫిబ్రవరి 11 : భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తూ, కొంగుబంగారంగా పిలువబడే భక్తుల ఇలవేల్పు గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల ఘనంగా ప్రారంభమయ్యింది. మాఘమాసం తొలి ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు తెల్లవారుజామున స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేక ఆలంకరణ చేసి, శ్రీవారికి ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్థన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి బియ్యం, బేడలతో పాటు వివిధ రూపాల్లో కానుకలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తొలివారం అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణాలతో మార్మోగింది. ఆలయం అవరణంలో ఉన్న 108 శివలింగాలను, సాయిబాబాను భక్తులు దర్శించుకున్నారు. శెలవు రోజు కావడంతో పట్టణం నుంచి అధిక సంఖ్యతో భక్తులు విచ్చేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, భాస్కర్ ఫర్టిలైజర్ ఎండీ విజయ్‌భాస్కర్ దంపతులు ప్రసాదం అందచేశారు.





దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



కళ్యాణదుర్గంలో రెండు చోట్ల నమోదైన ఓటరు జాబితా



ధర్మవరంలో మరణించినా తొలగించని వైనం..

తప్పేకొద్దీ తప్పులు..!

- ఓటర్లతో అధికారుల బంతాట
- టీడీపీ కంచుకోటలో గెలుపు కోసం వైసీపీ కుట్రలు
- ఫిర్యాదు చేసినా తొలగించని వైనం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 11 : దొడ్డిదారిన అధికార పీఠం దక్కించుకునేందుకు పాలకపక్షం చేస్తున్న ఎత్తుగడలు అన్నీ..ఇన్నీ.. కావని ప్రతిపక్ష పార్టీలతో పాటు ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ ఓట్లతో బంతాట ఆడటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. గెలుపే పరమావధిగా పోలింగ్ బూత్‌లను సైతం ఇష్టారాజ్యంగా మార్చేస్తున్నారు. ఇది ఓటర్లను అయోమయానికి గురిచేస్తోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఈ తతంగం పెద్ద ఎత్తున జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల మొదలు సార్వత్రికం వరకూ ఏ ఎన్నికల్లోనైనా కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఇక్కడ అధికార పార్టీ గెలుపుపై ఆశల్లేని పరిస్థితి. దీన్ని అధిగమించేందుకు కుట్రకు తెరలేపిందని ప్రతిపక్ష పార్టీ ఆరోపిస్తోంది. పట్టణంలోని పలు వార్డుల్లో ఒకే పేరు, రెండు చోట్ల కనిపిస్తూ ఉంది. కాని ఓటర్ల జాబితాలో నుంచి ఏ మాత్రం తొలగించడం లేదు.

జాబితాలో చిత్రాలెన్నో...

పట్టణంలో సుమారు పలు వార్డుల్లోను 60 మందికి పైబడి ఒకే ఓటరు పేరు, రెండేసి చోట్ల కనిపిస్తోంది. పట్టణంలోని రాజు అనే ఓటరు పేరు రెండేసి చోట్ల కనిపిస్తోంది. ఇదే పేరు 65 వ పోలింగ్ కేంద్రం, సీరియల్ నెంబర్ : 849 లో కనిపిస్తోంది. అదేవిధంగా పద్మావతి పేరు కూడా 66 వ పోలింగ్ కేంద్రంలో, 119 సీరియల్ నెంబర్‌లో కూడా ఇదే పేరు కనిపిస్తోంది. ఆసియా అనే ఓటర్ 65 వ పోలింగ్ బూత్, సీరియల్ నెంబర్ 1034 లో కనిపిస్తోంది. అలీభాషా అనే ఓటరు పేరు కూడా 65 వ పోలింగ్ బూత్, సిరియల్ నెంబర్ 210 లో కూడా కనిపిస్తోంది. బుజ్జమ్మ అనే ఓటరు పేరు కూడా 65వ పోలింగ్ బూత్‌లో సిరియల్ నెంబర్ 826 లో కనిపిస్తోంది. వెంకటేశులు అనే ఓటరు పేరు కూడా 65 వ పోలింగ్ కేంద్రం, నెంబర్ 211 లో కూడా ఉంది. నారాయణస్వామి పేరు 65 వ పోలింగ్ కేంద్రం, నంబర్ 919లో కనిపిస్తోంది. కార్తీక్ కుమార్ ఓటరు పేరు 65 వ పోలింగ్ కేంద్రం, సీరియల్ నెంబర్ 214 లో కనిపిస్తోంది. శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం మండలాల్లో కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని ప్రతిపక్ష పార్టీ పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం శూన్యం. ముఖ్యంగా పట్టణంలో ఇలాంటి తప్పిదాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. పట్టణం అయితే ఎవ్వరికి అనుమానం కలగదని, ఎక్కువగా ఇక్కడే తప్పిదాలు జరిగాయి. తికమక పట్టించే విధంగా ఉంది. ప్రతిపక్ష పార్టీ రెండేసి ఓట్లను ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు అందచేశారు. కాని ఏ స్థాయిలో చర్యలు తీసుకుంటారో తెలియడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓటరు జాబితాను పకడ్బందీగా తయారుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఓటర్లు కోరుతున్నారు.

మరణించినా తొలగించరు..

ధర్మవరంరూరల్ : మండలంలోని బిల్వంపల్లి తండా గ్రామంలో మృతి చెందిన వారి ఓట్లను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారు. సుమారు 5నుంచి 7ఏళ్ల క్రితం చనిపోయిన వారి ఓట్లు కూడా జాబితాలో రావడంతో స్థానికులు అవాక్కవుతున్నారు. ఆత్మలు ఏమైనా వచ్చి ఓట్లు వేస్తారా అంటూ పలువురు బీఎల్‌ఓలను ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారి ఓట్లు చనిపోయిన జాబితాలో చేర్చారని ప్రతిపక్షాలు మండిపడుతున్నారు. మాతో కలిసి వచ్చి ఇంటింటా సర్వేచేసి తీరా జాబితాలో అలాగే ఉంచుతారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

సవరణలేవీ..?

కుందుర్పి: ఓటర్ల జాబితాలో తప్పులు తప్పేకొద్దీ బయటపడుతున్నాయి. ఇంటింటా జాబితాను పరిశీలించామని చెబుతున్న అధికారులు మృతులను, గ్రామంలో లేనివారిని ఓటర్లుగా కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుందుర్పి మండలంలోని తీగలపల్లి గ్రామంలో 185 పోలింగ్ కేంద్రంలో దాదాపు ఎనిమిది మందికి పైగా మృతులు వున్నా వారిని ఓటర్లు గానే కొనసాగుతున్నారు. ఉదాహరణకు 773 సంజీవమ్మ, 777 మల్లన్న, 902 వనజాక్షమ్మ, 1013 సంజీవమ్మ, 1055 యల్లప్ప, ఇలా ఎనిమిది తొమ్మిది మంది మృతుల పేర్లు ఓటర్ల జాబితాలోనే వున్నాయి.

మరువకొమ్మ కాలువ పనుల్లో అవకతవకలు

డిజైన్ మార్పుతో ప్రజల సొమ్ము దుర్వినియోగం ● పదేపదే అబద్ధాలతో ఎమ్మెల్యే కాలయాపన : వైకుంఠం



మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11: నగరంలో మరువ కొమ్మ కాలువ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, ఇష్టారా జ్యంగా డిజైన్‌ను మార్పు చేసి ప్రజల సొ మ్మును దుర్వినియోగం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మండి పడ్డారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యా లయంలో ఆయన మాట్లాడుతూ.. మరువ కొమ్మ కాలవ పనుల్లో వ్యత్యాసాలతో కాలవ పనుల లక్షా ్యలకు తూట్లు పొవవడంపై గురువారం అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఒక రోజు నిరసన దీక్ష చేస్తామన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం చేస్తున్న ఈ దీక్షకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, విద్యావం తులు స్వచ్ఛందంగా కలిసి రావాలని ఆయన కోరారు. అనంతపురం అర్బన్‌లో టీడీపీ హ యాంలో చేసిన అభివృద్ధి, వైసీపీ పాలనలో ఏం చేశారో చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే అపద్ధపు మాట లపై తాను ఎప్పుడు ప్రశ్నించినా డొంకతిరు గుడు సమాధానాలు చెబుతూ తప్పించుకుం టున్నారన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, రోడ్ల పనులు, పలు రోడ్ల మం జూరు తదితర అంశాలను వైసీపీ హయాంలో చేసినట్లు పదేపదే అబద్ధాలు చెబుతూ అనంత వెంకటరామిరెడ్డి ప్రజలను మభ్య పెడుతూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. కళ్లకు కనపడుతున్నా వాస్తవాలను కనుమరుగు చేసి... అంతా తానే చేశానని అనంత వెంకట రామిరెడ్డి అపద్దాలు ప్రచారం చేయడం పద్ధతి కాదన్నారు. అసెంబ్లీలో, లోక్ సభలో ఏనాడైనా ప్రజల సమస్యలపై మాట్లాడావా అని నిలదీశారు. టిడ్కో ఇళ్లు తాము 90 శాతం పూర్తి చేస్తే.. 10 శాతం పనులు చేయకుండా పేదలకు అన్యాయం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు మాసా ల్లోనే అండర్ డ్రైనేజీని తెస్తామని, గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డును ఇతర ప్రాం తాలకు తరలిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఇప్పటికైనా పద్ధ తి మార్చుకొని, ఆత్మసాక్షిని ప్రశ్నించ ుకోవాల న్నారు. ఆయన అనంతలో పుట్టలే దని, అం దుకే అనంత వెంకటరామిరెడ్డికి అనంత పురం నగరంపై ప్రేమ లేదని అన్నారు. తాను ఇక్కడే పుట్టానని, మంచి పనుల కోసం పోరాడే నైజం తనదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, నాయకులు తలారి ఆదినారాయణ, సరిపూటి రమణ, మారుతీకుమార్ గౌడ్, ముక్తియార్, జేఎం బాషా పాల్గొన్నారు.

డబుల్ మహర్దశ



నిర్మించబోతున్న అనంతపురం రైల్వేస్టేషన్ నమూనా

- మారనున్న అనంత రైల్వేస్టేషన్ రూపురేఖలు
- డబుల్‌లైన్ ఏర్పాటుతో ఇక నాలుగు ప్లాట్‌ఫారాలు
- రెండో దశలో రూ. ఏడు కోట్లతో నూతన భవనం
- మరోవారంలో పాతభవనం తొలగింపు.!
- ఏడాదిలో పనులు పూర్తయ్యే అవకాశం



రెస్టారెంట్ నిర్మాణం కోసం తొలగించిన స్కూటర్ల పార్కింగ్ స్టాండ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 11: అనంతపురం రైల్వేస్టేషన్ రూపురేఖలు మరో ఏడాదిలో పూర్తిగా మారనున్నాయి. ఇప్పటికే డబుల్ లైన్ ఏర్పాటులో భాగంగా కేవలం రెండు ప్లాట్‌ఫారాలకే పరిమితం అయిన స్టేషన్‌లో నాలుగు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తున్నారు. డబుల్ లైన్ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. స్టేషన్ ఆవరణంలో నిర్మాణం ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

ప్రస్థానం : 1892లో గుంతకల్లు నుంచి బెంగళూరు మధ్య రైళ్ల రాకపోకలకు అనంతపురం మీదుగా మీటర్ గేజ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం 1977 అక్టోబరు 2 సౌత్ సెంట్రల్ రైల్వేగా మారింది. తిరిగి మీటర్ గేజ్‌తో పాటు 1982లో బ్రాడ్ గేజ్ లైన్ కూడా ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్, గుంతకల్లు, వాడి డివిజన్లుగా ఏర్పాటు చేశారు. 2006లో జిల్లా కేంద్రం మీదుగా గుంతకల్లు, ధర్మవరం, పాకాల మార్గాన్ని బ్రాడ్ గేజ్‌గా మార్చు చేశారు. 2016లో విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం డబుల్ లైన్ పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు స్టేషన్ రూపురేఖలనూ మార్చనున్నారు. మొదటి దశ పనులు దాదాపు ఆఖరి దశకు చేరుకున్నాయి. పాత స్టేషన్ భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

ఏడాదిలో పనులు పూర్తి



అధునాతన సౌకర్యాలతో నూతన రైల్వే స్టేషన్‌ను ప్రయాణికులకు అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబరు నుంచే రెండో దశ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే రెండు నెలలైనా ఇంకా ఆ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ద్విచక్రవాహనం పార్కింగ్ స్టాండ్ స్థలంలో అన్ని హంగులతో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఏడాదిలోగా మొత్తం పనులు పూర్తయ్యే అవకాశముంది.

- అశోక్‌కుమార్, స్టేషన్ మేనేజరు, అనంతపురం

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



రామగిరి, ఫిబ్రవరి 11: మండలంలోని మక్కిన వారిపల్లి, ఎగువపల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి (గుడ్డమయ్యస్వామి) విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. 11 గంటలకు మహాపూర్ణాహుతి చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

14న రేణుకా యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి : మండలంలోని పోలేపల్లి గ్రామంలో రేణుకాయల్లమ్మ దేవి విగ్రహ, గోపుర, శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామస్థులు తెలిపారు. సోమవారం నుంచే ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు.

వైసీపీ పాలనలో డ్వాక్రా సంఘాలు నిర్వీర్యం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 11: డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత విమర్శించారు. ఆదివారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా ఏడో డివిజన్‌లోని నీరుగంటివీధిలో పర్యటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ పార్టీలకు ఓటు వేసి కొత్త ప్రభుత్వానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.

పశువుల సంత ఆదాయం రూ.3.39 లక్షలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 11: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,39,350 ఆదాయం వచ్చిందని మా ర్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,75,300, ఆదివారం జరిగిన ఎను ములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,64,050 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11: బెంగుళూరు రోడ్డులోని శివబాలయోగి మహరాజ్ ఆశ్రమం, అనంతేశ్వరస్వామి దేవాలయ ముఖద్వార నిర్మాణానికి ఆదివారం సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. ఆశ్రమానికి వెళ్లే ప్రధాన మార్గం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖద్వార నిర్మాణాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు దేవరాజు, జీవీ లక్ష్మయ్య, కలవల మల్లికార్జున, జూటూరు మహేష్ బాబు, జూటూరు గోపాలకృష్ణ, ప్రసాద్, విశ్వనాథ్, టంగుటూరు నాగభూషణం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అరటితోట దగ్ధం - రూ.5 లక్షలు నష్టం



ఆహుతైన అరటితోట

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని నాగ సముద్రం గ్రామంలో చంద్రశేఖర్‌కు చెందిన అరటితోట ఆదివారం అగ్నికి ఆహుతైంది. గ్రామ సమీపంలోని అతని నాలుగెకరాల్లో రెండేళ్ల క్రితం అరటిపంటను సాగుచేశాడు. ఆదివారం మధ్యాహ్న సమయంలో తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు, చుట్టు పక్కన ఉన్న రైతులు ఆ మంటలను ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. 10 రోజుల్లో పంట కోత చేపట్టే సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తోట పక్కన ఉన్న ఎండుగడ్డికి నిప్పుపెట్టడంతో మంటలు తోటలోకి వ్యాపించి.. పంట కాలీ బూడిదైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తనకు రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందన్నాడు.

అనారోగ్యంతో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 11: అనంతపురం ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్ అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రాజశేఖర్ 1992లో ఏపీఎస్పీ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరారు. 2005లో ఏఆర్ విభాగానికి కన్వర్షన్ అయ్యారు. అప్పటి నుంచి జిల్లా ఏఆర్ విభాగంలో పనిచేస్తున్నారు. ఇటీవలే అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఆయనకు భార్య రాధ, కొడుకు సాయిపవన్, కుమార్తె కీర్తన ఉన్నారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, స్థానిక నందమూరినగర్‌లో ఉంచిన రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆదివారం పిల్లిగుండ్ల క్వార్టర్స్ సమీపంలో జరిగిన అంత్యక్రియల్లో జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, మృతుని బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 11: స్థానిక టీవీ టవర్ సమీపంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆదివారం తెలిపారు. అతని నుంచి 35 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొప్పలకొండలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గార్లదిన్నె, ఫిబ్రవరి 11: మండలంలోని కొప్పలకొండ ఉన్నత పాఠశాలలో 2013-14 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. అలనాటి గురువులు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ నాయుడు, రామకృష్ణ, రామాంజినేయులు, కిష్టప్ప, లావణ్య, నరేంద్ర, లక్ష్మీనారాయణ, ఓంప్రకాష్, చంద్రశేఖర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, నాయుడును ఘనంగా సన్మానించారు.



విద్యార్థిని ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



ఆత్మకూరు ఫిబ్రవరి 11: మండలంలోని వడ్డుపల్లి గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి లిఖిత గుండె ఆపరేషన్ కోసం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరుశురామ్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. తల్లిదండ్రులు ఆ చిన్నారికి గుండె ఆపరేషన్ చేయించడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో పరిటాల కుటుంబం ఆదేశాలు మేరకు తనవంతుగా సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి క్రిష్ణమోహన్ చౌదరి, నారాయణస్వామి, ఏడీ ఈశ్వరయ్య, దాసరి అనీల్, పెద్దన్న, నరేష్‌కుమార్, వెంకటరాముడు, రామచంద్ర పాల్గొన్నారు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శుల ఎన్నిక



రమణారెడ్డి, రామాంజనేయులు

అనంతపురం కల్చరల్ : సీపీఐ అనుబంధ ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ప్రక్రియను ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ నేతృత్వంలో నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ... విద్యార్థుల పట్ల గుదిబండగా మారిన 117 జీఓను రద్దు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కార్యక్రమాలు చేపడతామన్నారు.

వైసీపీ భూస్థాపితానికి ప్రజలు సిద్ధం

టీడీపీ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ





చిన్నజలాలపురం ప్రచారంలో బండారు శ్రావణి శ్రీ, టీడీపీ నాయకులు, ప్రసన్నాయపల్లిలో నాయకుల ప్రచారం

శింగనమల, ఫిబ్రవరి 11: వచ్చే ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గం టీడీపీ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం శింగనమల మండలంలోని చిన్నజలాలపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో గ్రామాలు ఏ మాత్రం అభివృద్ధి చెందలేన్నారు. టీడీపీని గెలిపించేందుకు అన్ని వర్గాల ప్రజలూ సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మాజీ జడ్పీటీసీ షాలిని, ఓబుళపతి, ధనుంజయ్య, రామాంజినేయులు, రవిశంకర్, వెంకట రమణస్వామి, వీరానారాయణ, ఈశ్వర్‌రెడ్డి, చింతబరిదొర, గుర్రం లక్ష్మీనారాయణ, సత్తి, రాజశేఖర్ యాదవ్, జీసీబాబు, దండు విజయ్, రహితుల్లా, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

రాప్తాడు : వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప మండిపడ్డారు. ఆదివారం మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, ప్రసన్న, రామాంజినమ్మ, ఆదెప్ప, ధనుంజయ పాల్గొన్నారు.

ఘంటసాల పాటలు శాశ్వతం

అలనాటి దూరదర్శన్ వ్యాఖ్యాత విజయదుర్గ



ఘంటసాల విగ్రహం వద్ద విజయదుర్గ తదితరులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11: ఈ భూమి ఉన్నంతకాలం ఘంటసాల పాట ఉంటుందని అలనాటి దూరదర్శన్ వ్యాఖ్యాత విజయదుర్గ పేర్కొన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని పాతపాటల ప్రేమికుల సమూహం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు ఆవరణంలోని ఘంటసాల మండపం వద్ద సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమానికి విజయదుర్గ ముఖ్యఅతిథిగా హాజరై ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ... ఎంత మంది గాయనీగాయకులు వచ్చినా ఘంటసాల గాత్రానికి మాత్రం ప్రజలందరి మదిలో సుస్థిర స్థానం ఉంటుందన్నారు. అనంతరం నిర్వ హించిన సంగీత విభావరిలో కళాకారులు ఘంటసాల పాటలతో అలరించారు. కార్యక్ర మంలో పాతపాటల ప్రేమికుల సమూహం నాయకులు ఓబులదాస్, జీవి రామయ్య, మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, విఆర్‌ఓ నాగస్ ప్రసాద్, శ్రీనివాసరావు, రామ్మోహన్ రెడ్డి, దుర్గాప్రసాద్, సత్యనారాయణమూర్తి, కేశవ, శాంతి, శ్రీమణి, శ్రీదేవి, ఇందిర పాల్గొన్నారు.

బాధితులకు పరిటాల సునీత పరామర్శ



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 11: మండలంలోని పెనుబోలు గ్రామానికి చెందిన గోసేకాంతమ్మ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మరణించారు. మాజీ మంత్రి పరిటాల సునీత ఆదివారం పెనుబోలు గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, మారుతీప్రసాద్, బాలరాజు, ఆంజనేయులు, నల్లప్ప, ఎంపీటీసీ శ్రీనివాసులు ఉన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

శింగనమల: శింగనమల టీడీపీ సీనియర్ నాయకుడు గంట రోశన్న అనారోగ్యంతో ఆదివారం మరణించారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. రోశన్న కుమారులు గంట నారాయణస్వామి, గంట శివకుమార్, పవన్‌కూమార్, కుంటుబలకు పరామర్శించారు. అంతిమ క్రియలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగధార్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుసురాం, కాయల సురేష్, నారాయణస్వామి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి దండు విరాళం

మండలంలోని వెస్టునరసాపురం కొల్లాపురమ్మ గుడి నిర్మాణానికి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం తన స్వగృహంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్, కుళ్ళాయప్ప, మహీపతి, రాము, మురళీ, చలపతి, నారాయణస్వామి, దండు ప్రకాశ్ పాల్గొన్నారు.

ముంటిమడుగు ఆర్థిక సాయం

గార్లదిన్నె : శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన నాయక్ వివాహా నికి శింగనమల నియోజకవర్గం టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి ఆదివారం రూ. 10వేలు ఆర్థిక సాయం అందచేశారు.

కౌసల్యకు 'స్వర్ణ నంది' జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దేవరకొండ కౌసల్య

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11: అనంతపురం నగరానికి చెందిన ఓం సంగీత నృత్య శిక్షణాలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య 'స్వర్ణ నంది' జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు సంస్కృతి సాహితీసేవ ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ సభలో కౌసల్యకు తెలుగు సంస్కృతి సాహితీసేవ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ మాచవరం గౌరీశంకర్ ఆ పురస్కారం అందజేశారు.

తరిమెల నాగిరెడ్డికి ఘన నివాళి

అనంతపురం క్లాక్‌టవర్: పేదలు, రైతుల పక్షాన పోరాడిన తరిమెల నాగిరెడ్డి 107వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక నగరంలోని ఆయన విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ఇందులో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు తరిమెల అమర్‌నాథ్ రెడ్డి, ప్రజాగాయకుడు ఆది నారాయణ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు నాగభూషణం, సుధాకర్, స్త్రీవిముక్తి సంఘటన కార్యదర్శి మల్లేశ్వరి, శ్రీలక్ష్మి, రాధా, పీడీఎస్ఓ నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1987-1988 పదో తరగతి చదివిన అలివేలమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు తమవంతు సాయంగా ఆదివారం రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు సతీష్‌కుమార్, మూడిండ్ల వెంకటేసులు, గుజ్జుల వెంకటేసులు, జగన్‌మోహన్ రెడ్డి, అతికిరెడ్డి, బాషా పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం

అనంతపురం కల్చరల్ : మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని గుల్బర్గాకు చెందిన మహ్మమద్ అజ్గర్ హుసేని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ మతపెద్దలు బాషు, షర్ఫుద్దీన్, మస్తాన్ ఖిలాఫత్ స్వీకరించి ఆరు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం రాత్రి వినాయకనగర్‌లో ప్రభుత్వ ఖాజీ జాహిద్ హుసేన్ ఆస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో అజ్గర్ హుసేని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం ఫకీరుల జల్సా నిర్వహించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



కొత్తూరులో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వజ్రకవచ చీరలో అమ్మవారు



పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11: వాసవీ కన్యకాపరమేశ్వరిమాత ఆత్మార్పణ దినం సందర్భంగా స్థానిక కొత్తూరు, పాతూరు అమ్మవారిశాలల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుల్జార్‌పేటలోని కొత్తూరు అమ్మవారిశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నర్సింహులు, నాయకులు మిట్టా ఆంజనేయులు, టంగుటూరు నాగభూషణ, కృష్ణం రఘు, ఆర్యవైశ్య యువజన, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. పాతూరు ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ను నాగరత్నం, చల్లా కృష్ణరంగయ్య, యువజన సంఘం, మహిళా మండలి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిగీతాలను ఆలపిస్తున్న మహిళలు →



నారా లోకేశ్ శంఖారావం విజయవంతానికి ప్రార్థనలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11: నారాలోకేశ్ చేపట్టిన శంఖారావం కార్యక్రమం దిగ్విజయం అయ్యేం దుకు టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం స్థానిక అగాపే కల్వరి చర్చ్‌లో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ప్రార్థనలు చేశారు. అలాగే టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్ ఆధ్వర్యంలో తపోవనంలోని మసీదులో దువా చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి ఆది నారాయణ, సరిపూటి రమణ, మారుతీకుమార్ గౌడ్, మార్కెట్ మహేష్, జేఎం బాషా, నవీన్, ఫరూక్ హఫీజ్ సాబ్, ఖాజాపీరా, పవన్‌కుమార్, హాజీవలి, అశ్వక్ పాల్గొన్నారు.





చర్చిలో ప్రార్థన, మసీదులో దువా చేస్తున్న నాయకులు

టీడీపీలోకి 80 కుటుంబాల చేరిక


టీడీపీలో చేరిన వారితో జితేంద్రగౌడు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి11: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు క్యాంపు కార్యాలయంలో ఆదివారం 7వ వార్డుకు చెందిన 80 కుటుం బాలు టీడీపీలో చేరాయి. ఆ వార్డు ఇన్‌చార్జి కురుబ శివన్న ఆధ్వర్యంలో కురుబ, వడ్డేర, వంశరాజులు, వాల్మీకి కులాలకు చెందిన 80 కుటుంబాలకు జితేంద్రగౌడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో తాగునీరు, విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు, డ్రైనేజీ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ మరో శ్రీలంక కాకుండా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ దోనిముక్కల, కసాపురం రోడ్డులోని భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తలారి మస్తానప్ప, కేశప్ప, రాయల్ రామయ్య, హనమంతు, రామన్నచౌదరి, జింకలజగన్నాథ్, గోపాల్, బండిలక్ష్మీదేవి పాల్గొన్నారు.

లచ్చానిపల్లిలో 30 కుటుంబాలు..


టీడీపీ కండువా వేస్తున్న వెంకటశివుడు యాదవ్

గుత్తిరూరల్, ఫిబ్రవరి11: మండలంలోని లచ్చానిపల్లిలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరంతా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన గంగిరెడ్డి, కేశవరెడ్డి, రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డితో పాటు మరో 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచు సుంకన్న, టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు, రంగారెడ్డి యాదవ్, ఆనంద్ వెంకట శివుడు, నరేంద్ర, రామాంజునేయులు, రాము, పవన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమిద్యాలకు చెందిన 30 కుటుంబాలు...


టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 11: మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం వైసీపీ నాయకుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నాయకులు రామాంజినేయులు, ప్రభాకర్, శంకరయ్య, వెంకటేశులుకు పయ్యావుల శ్రీనివాసులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమనే నమ్మకంతో పార్టీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు మారెప్ప, రేగాటి నాగరాజు, టీడీపీ నాయకులు శ్రీధర్, రామకృష్ణ, గోవిందు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని హనిమిరెడ్డిపల్లిలో వైసీపీకి చెందిన మైనార్టీ నాయకులు ఖాదర్ ఆదివారం డీపీలోకి చేరారు. మండలంలోని కన్వీనర్ ప్రసాద్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి


దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని గాంధీసర్కిల్ వద్ద ఆదివారం బీజేపీ నేత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రంగనాథరెడ్డి, ఆంజనేయులు, రామాంజనేయులు, నారాయణస్వామి, శేషారెడ్డి పాల్గొన్నారు.

యువత చేతిలో రాష్ట్ర భవిష్యత్తు


సమావేశంలో మాట్లాడుతున్న మంజునాథ్‌గౌడ్

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 11: యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు ఉందని జనసేన తాలూకా ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి పేర్కొన్నారు. జనసేన పార్టీ యువనాయకులు ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంజునాథగౌడ్, కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగాలు పూర్తిగా మరుగున పడిపోయాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యువతను పూర్తిగా మోసగించారని మండిపడ్డారు. వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు

గుత్తి, ఫిబ్రవరి11: పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలను నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి 700 మంది విద్యార్థులు హాజరయ్యారు. రమేష్, ధన, విజయ్‌కుమార్, జిలాన్‌బాషా పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం: పీజేఆర్


యువకులతో టీడీపీ నాయకుడు జీవానందరెడ్డి

పామిడి, ఫిబ్రవరి 11: ఓటు వజ్రాయుధం లాంటిదని.. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేది ఈ ఓటర్లేనని టీడీపీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో తొలి ఓటర్లతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. తొలి ఓటును రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి బాటలో నడిపే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీకి వేయాలని ఆయన సూచించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా మై ఫస్ట్ ఓట్ ఫర్ విజినరీ లీడర్ సీబీఎన్ అంటూ యువత నినదించారు. రాష్ట్రాభివృద్ధిలో తాము భాగస్వాములమవుతామంటూ తొలి ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మున్నా, షేక్షావలి, బాషా, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం

- మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు


కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో టీడీపీ గెలుపు తథ్యం అని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మన కోసం మన శీనన్న అనే కార్యక్రమాన్ని మండ లంలోని హొసగుడ్డం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాలవ శ్రీనివాసులు జనసేన తాలూకా ఇన్‌చార్జ్ మంజునాథ్‌గౌడ్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా 69 కుటుంబాలు మాజీ మంత్రి సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పుష్పావతి నాగప్ల్లి, గంగాధర, మల్లికార్జున, హనుమంతు, గులెప్ప, రామాంజినేయులు, వన్నూరుస్వామి, అంబన్న, చంద్ర, చిక్కన్న, రాజు, గాదిలింగ, అంజి, నరసింహ పాల్గొన్నారు.

రేపటి నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు


అలంకరణలో సేవాలాల్ మహరాజ్ మాతాజగదంబ

గుత్తిరూరల్, ఫిబ్రవరి11: బంజరాల పవిత్ర పుణ్యక్షేత్రం సేవాఘడ్‌లో మంగళవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలను గత 23 సంవత్సరాలుగా నిర్వహి స్తున్నారు. ఈ నెల 13న సంత్ సేవాలాల్ మహరాజ్, మాతా జగదాంబకు ఉదయం అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. 14న రాత్రికి జయంత్యుత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం స్వామివారిని పల్లకిలో కొలువుదీర్చి మేళ తాళాల మధ్య గుర్రంపై ఊరేగిస్తారు. మాలధారుల ఇరుముడి విరమణ కార్యక్రమం నిర్వహిస్తారు. 15న మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అత్యంత కీలకమైన మహాభోగ్ కార్యక్రమం వైభవంగా నిర్వహించి జయంతి ఉత్సవాలు ముగిస్తారు. ఈకార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్దసంఖ్యలో తరలివస్తారు. రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ ఏడాది కూడా దేశ వ్యాప్తంగా ఉన్న బంజారాలు రానున్నారు. ఉత్సవాలను జయప్రదం చేయడానికి ట్రస్టు సంఘం, సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పోస్టరు విడుదల

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లిలో ఆదివారం సేవాలాల్ మహరాజ్ జయంతి పోస్టర్‌ను బంజారా సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో 14, 15 తేదీలలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజస్థాన్‌కు చెందిన చేతన్ గిరీజీ మహరాజ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు సుబ్రహ్మణ్యంనాయక్, నారాయణనాయక్, మురళినాయక్, వాల్యానాయక్, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


గుంతకల్లులో అలంకరణలో వాసవీ మాత


పామిడిలో అలంకరణలో అమ్మవారు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని కన్యాకపరమేశ్వరి దేవాలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారి విగ్రహానికి భక్తుల చేత పాలాభిషేకం చేయించారు. ఆలయంలో 102 మంది దంపతుల చేత హోమాన్ని నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేషపుష్పలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాజగదీష్, కార్యదర్శి కే కృపాకర్, కోశాధికారి మేడం వెంకటేశ్వర్లు, సభ్యులు జయంతి వెంకట్, పరుచూరిసత్యరంగయ్య, సురేష్, సాయిరంగ, సత్యనారాయణ, ఇనుగూరు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత సహస్ర నామ పారాయణం, కన్యకా పరమేశ్వరి అష్టోత్తర పూజలు, కుంకుమ అర్చన గావించారు. హన్‌మాన్ చాలీసా పారాయణం, శ్రీరామ తారక మంత్ర పఠనం చేశారు. అనంతరం విశేష పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాసవి మాతృ మండలి, ఆర్యవైశ్య సంఘం, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 11: మండలంలోఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. బూదిగుమ్మ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసిన తర్వాత రామసాగరంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, పెద్ద తిప్పయ్య, ప్రసాద విరుపాపల్లి రాధాకృష్ణ, మల్లికార్జున, సర్పంచ్‌లు వెంకటనాయుడు, తిమ్మప్ప పాల్గొన్నారు.

కంబదూరులో బాలిక కిడ్నాప్ యత్నం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 11: కంబదూరులో వున్న సీఅండ్ ఐజి చర్చి వద్ద ఆదివారం ఓ బాలిక కిడ్నాప్ యత్నం జరిగింది. కంబదూరుకు చెందిన ఏడేళ్ల బాలిక తాత, అవ్వతో కలిసి సీ అండ్ ఐజి చర్చికి వచ్చింది. తాత, అవ్వలు చర్చిలో ప్రార్థనలు చేస్తుండగా ఆ బాలిక నడుచుకుంటూ బయటకు వచ్చింది. ఆ సమయంలో చర్చి బయట ఇద్దరు ముఖానికి మాస్కులు ధరించి ద్విచక్ర వాహనంపై వున్నారు. ఆ బాలిక వస్తున్న సమయాన్ని గమనించి చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తామని పిలవగా ఆమె అటు వైపు వెళ్లింది. ఆ పాపను ద్విచక్రవాహనంలోకి ఎక్కించుకునేందుకు ప్రయత్నించారు. అక్కడే వున్న కంబదూరు గ్రామ వలంటీర్ సుమలత వారిని చూసి గట్టిగా కేకలు వేసింది. అప్రమత్తమైన ఆ కిడ్నాపర్లు ఆ బాలికను వదిలేసి ద్విచక్రవాహనంలో వేగంగా వెళ్లిపోయారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. వారం రోజుల క్రితం పాత మార్కెట్ వద్ద కూడా ద్విచక్రవాహనంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించినట్లు తెలిసింది.

ఘంటసాలకు ఘన నివాళి


గుంతకల్లులో ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని ఘంటసాల కల్చరల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఘంటసాల పాడిన పాటలు నేటికి మరవలేనివన్నారు. ఘంటసాల ఆలాపించిన భగవద్గీత తెలుగు నాట అత్యంత ప్రజాదరణ పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ అధ్యక్షుడు సీ రామాంజినేయులు, కార్యదర్శి బీ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో...

తాడిపత్రిటౌన్: పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో ఆదివారం గాన గంధర్వుడు ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని తాడిపత్రి ఘంటసాల గానసభ వారిచే పాడుతా తీయగా చల్లగా సంగీత విభావరి జరిగింది. పలువురు గాయకులు అలనాటి ఘంటసాల ఆణిముత్యాలను పాడారు.

గాంధీకట్ట వద్ద

తాడిపత్రిలోని గాంధీకట్ట వద్ద ఉన్న స్నేహభారతి సంగీత శిక్షణాలయంలో ఆదివారం ప్రముఖ సంగీత దిగ్గజం ఘంటసాల 50వ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మధుర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో మహేష్‌స్వామి, రామకృష్ణ, బాలు, గోకుల్ మాధవ, మహేశ్వరశర్మ పాల్గొన్నారు.

గుత్తిలో చోరీ


చెల్లాచెదురుగా పడిఉన్న వస్తువులు

గుత్తి, ఫిబ్రవరి 11: పట్టణంలోని ఇండ్రస్టియల్ ఏరియాలో విక్రమ్ అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం చోరీ జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈయన పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక ఇండ్రస్టియల్ ఏరియాలో నివాసముంటున్నాడు. మూడు రోజుల క్రితం దైవదర్శనం కోసం కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి షిరిడీకి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టిన విషయాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో బీరువాను పగలగొట్టి 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.25వేలు, పూజగదిలో ఉన్న వెండి ఆభరణాలు, హుండీల్లో ఉన్న డబ్బు సైతం ఎత్తికెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు దుండగులు చోరీ చేస్తున్న దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మూడు మోకాళ్లమ్మ అమ్మవారి ఊరేగింపు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 11: మండల కేంద్రంల మూడుమోకాళ్లమ్మ అమ్మవారి ఊరేగింపు ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. అంబేడ్కర్ కాలనీలో దళితులు మూడుమోకాళ్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గంగాజలం తెచ్చి అభిషేకాలు జరిపించారు.

విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకే ప్రజ్ఞా వికాసం పరీక్షలు


కళ్యాణదుర్గంలో మాదిరి ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గం, ఫిబ్రవరి 11: పదో తరగతి విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సెయింట్‌పాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాసం మోడల్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్, యూటీఎఫ్ జిల్లా నాయకులు వెంకటరామిరెడ్డి పాల్గొని మోడల్ పరీక్ష పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ మాట్లాడుతూ విద్యార్థులలో పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల స్థాయిలో మొదటి మూడు బహుమతులు, జిల్లాస్థాయిలో టాప్ 10 ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గౌతమ్, పట్టణ ఉపాధ్యక్షుడు ప్రేమ్, వీరేష్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: పదో తరగతి విద్యార్థులకు మాదిరి పరీక్షలకు కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు, యుటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఈశ్వరయ్య, శెట్టూరు ఎంఈవో శ్రీధర్ పదవ తరగతి మాదిరి పరీక్షలను మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ పరీక్షలకు దాదాపు 500 మంది విద్యార్థులు పైగా హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన వారికి మండల స్థాయిలో బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిత్తప్ప సాయిరాం, అశోక్, ఆంధ్ర తిప్పేస్వామి, రామిరెడ్డి, రాజన్న, ఆంజనేయులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: వ్యవసాయ కూలీలకు గాయాలు


బళ్లారిలో చికిత్స పొందుతున్న కాడమ్మ, శివమ్మ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 11: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ శివారు హెచ్చెల్సీ వంతెన పక్కన ఆదివారం ట్రాక్టర్ బోల్తాపడి పలువురు వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. బాధితులు, గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన గుండప్ప పొలంలో మిరప పంట కోత కోసం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మల్లెక్క, శృతి, శశికళ, గంగమ్మ, హెచ్ హనుమక్క, వండ్రమ్మ, కాడమ్మ, శివమ్మలతో పాటు మరో పది మంది ఈశ్వరప్ప ట్రాక్టర్‌లో బయల్దేరారు. హెచ్చెల్సీపై ఉన్న వంతెన మూడేళ్ల కిందట కూలింది. ఈ నేపథ్యంలో పొలాలకు వెళ్లేందుకు హెచ్చెల్సీ కాలువలోనే మార్గాన్ని ఏర్పాటు చేసుకుని ట్రాక్టర్‌లో వెళుతున్నారు. ఆదివారం ఉదయం మిరప పంట కోతకు ట్రాక్టర్‌లో వెళ్లగా కాలువ గట్టు ఎక్కుతున్న సమయంలో గేర్లు న్యూట్రలై వెనక్కు వస్తూ బోల్తా పడింది. దీంతో కాడమ్మ, శివమ్మ, వండ్రమ్మలకు తీవ్ర గాయాలు కాగా బళ్లారి ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వంతెనను నిర్మించి ఉంటే ఈ ప్రమాదాలు జరిగేవి కాదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు మండల సమావేశం

ఉరవకొండ, ఫిబ్రవరి 11: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అమృత్‌రాజ్ తెలిపారు. ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

బెళుగుప్ప: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రారంభమైన అశ్వత్థం తిరునాల


అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి11: మండలంలోని చిన్న పప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణ స్వామి, శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయ తిరునాల ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మొదటి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

ఏటీఎంలో చోరీ యత్నం

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి11: పట్టణంలోని సంజీవ నగర్ మొదటిరోడ్డులో ఉన్న ఏటీఎంలో చోరీయత్నం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున గుర్తుతెలియని దుండగులు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నీట్ కోసం ఆర్థిక సాయం

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి11: పట్టణానికి చెందిన రాజరమేష్, కోటేశ్వరి దంపతుల కుమార్తె లక్ష్మినరసమ్మ నీట్ చదువుకోసం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థికసాయం అందించినట్లు సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు తెలిపారు. ఎన్ఆర్ఐ కిరణ్‌కుమార్, భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పెంటర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నబీరసూల్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దపప్పూరు, ఫిబ్రవరి11: మండలంలోని చింతల పల్లి గ్రామశివారులోని చీనీతోటలో ఆదివారం పేకాట ఆడుతున్న 12మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,04,040 స్వాధీనం చేసుకున్నట్లు సర్కిల్ సీఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ శరత్ చంద్ర సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు.

యాడికిలో ఆరుగురు..

యాడికి: మండలకేంద్రంశివారులో ఆదివారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.10120 స్వాధీనం చేసుకున్నామని సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆంజనేయస్వామి కాలనీ సమీపంలో దాడులు నిర్వహించి, అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

నేడు ఇంటి పట్టాల పంపిణీ

యాడికి, ఫిబ్రవరి11: మండలంలోని రాయల చెరువులోని 118మంది లబ్ధిదారులకు సోమవారం ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలమ్మ తెలిపారు. మండలంలోని రాయలచెరువులో అర్హులైన 118మంది లబ్ధిదారులకు ఇంటిస్థలాల మంజూరు హామీ పత్రాలను గతంలో పంపిణీ చేశారు. ఆదర్శపాఠశాల వద్ద ఏర్పాటుచేసిన లేఔట్‌లో 118మందికి పట్టాలు ఇవ్వనున్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

ఉరవకొండ, ఫిబ్రవరి11: మండలంలోని బూదగవి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం కుక్కల దాడిలో 15 గొర్రెపిల్లలు మృతి చెందాయి. ధనుంజయ అనే గొర్రెల కాపరి పిల్లలను కంచెలో ఉంచి గొర్రెలను మేతకు తోలుకుని వెళ్లాడు. కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో 15గొర్రెపిల్లలు మృతి చెందినట్లు తెలిపారు. రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపాడు.

వేపరాలలో కరెన్న స్వామి వేడుకలు

రాయదుర్గం, ఫిబ్రవరి 11: మండలంలోని వేపరాల గ్రామంలో వెలసిన కురుబల దైవం కరెన్నస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయమే స్థానిక వేదావతి నది లో గంగపూజ చేసి కోరివంశం వారికి పురోహితులు గంగాప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కరెన్నస్వామితో పాటు కరలింగేశ్వరస్వామి, బొగ్గేరప్ప స్వామి, దొణకల్లప్పస్వామి, నందవారప్పస్వామీల విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంపై కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించి హోమాన్ని కూడా నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుండి వందలాది కురుబ కులస్థులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

చిరంజీవిని కలిసిన బలిజ నాయకులు


చిరంజీవికి అందజేస్తున్న హరినాథ్, నరేష్‌రాయల్

గుత్తి, ఫిబ్రవరి 11: పట్టణానికి చెందిన బలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు హరినాథ్, నరేష్‌రాయల్‌లు ఆదివారం హైదరాబాదులో సినీనటుడు చిరంజీవిని ఆయన నివాసంలో కలిసినట్లు తెలిపారు. పద్మవిభూషణ్ అవార్డు రావడంతో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 11: కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఓ మహిళను అరెస్టు చేసినట్లు కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. కంబదూరు మండలంలోని కురాకులపల్లిలో ఓ మహిళ అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో 35 టెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. దీంతో ఆ మహిళను అరెస్టు చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్నా, అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిసినా వెంటనే తమకు సమాచారాన్ని అందించాలని ఆయా గ్రామాల ప్రజలను ఆయన కోరారు.